క్లుప్తంగా

వైఎస్సార్‌కు నివాళి



కావలి: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. నెల్లూరు సురేష్‌రెడ్డి, పరుసు మాల్యాద్రి, పొనక గోపాల్‌రెడ్డి, పేరం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైకుంఠపురానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఇడుపులపాయకు వెళ్లారు.

డైరీల ఆవిష్కరణ



మర్రిపాడు : మండల్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటరియేట్ ఇంజనీర్స్ నూతన సంవత్సర డైరీలను ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీవాసు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఏఎస్ఈ మండలాధ్యక్షుడు కే వెంకటేష్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులకు డైరీలు అందజేశారు.

కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల్లో కావలి కళాకారిణులు



కావలి: కృష్ణా జిల్లా కూచిపూడిలో కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల్లో భాగంగా వేలాది మంది కళాకారులతో నిర్వహించిన మహాబృంద నాట్య ప్రదర్శనలో కావలికి చెందిన సంయుక్త నృత్య కళా నిలయం కళాకారిణులు పాల్గొన్నారు. నాట్య గురువు గంగపట్నం లిఖిత ఆధ్వర్యంలో శిష్యులు షేక్.హసీన, సీహెచ్ మోక్షశ్రీ, సాయి నిహారిక, బీ యశశ్రీ విద్య, సయ్యద్ అర్షియా, వీ లక్ష్మీ, పల్లవి, రిషిత, రక్షిత, కృష్ణ ప్రియ, మనస్వి, రిత్విక, జీ ఇందుప్రియ నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు.

మద్యం దుకాణాన్ని మార్చాలని వినతి

సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామపురంలో ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని మరోచోటుకు మార్చాలని జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి సింగన నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. మండల ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలోనే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నవించారు.

నిత్యావసరాల వితరణ



కావలి: వెంగళరావునగర్‌లో ఉన్న డీఆర్ విశ్వోదయ సేవాసమితి కార్యాలయంలో నిరుపేద వృద్ధులకు రూ.65వేల విలువైన నిత్యావసర సరుకులను సోమవారం వితరణ చేశారు. విశ్వోదయ విద్యా సంస్థల రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, విట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 65 మంది వృద్ధులకు నిత్యావసర వస్తువులతో పాటు రూ.60 చొప్పున అందజేశారు. దంత వైద్యులు ఎస్కే ఫయాజ్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరై డీఆర్ విశ్వోదయ సేవా సమితి సేవా కార్యక్రమాలను కొనియాడారు. వృద్ధులకు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తానని హామీ ఇచ్చారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, సభ్యులు వల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ధనెంకులకు నివాళి



వరికుంటపాడు: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే ధనెంకుల నరసింహం వర్ధంతిని పురస్కరించుకుని కాకొల్లువారిపల్లెలోని ఆయన విగ్రహానికి స్థానికులు సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలోనూ ధనెంకుల చిత్రపటానికి సిబ్బంది పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు, ఈఓపీఆర్డీ నాగూర్‌వలి, సీనియర్, జూనియర్ సహాయకులు వెంకటాద్రి, రామకృష్ణారెడ్డి పాల్గొల్గొన్నారు.

ప్రశాంతంగా వేడుకలను జరుపుకోవాలి

ఆత్మకూరు/సంగం: నూతన సంవత్సర వేడుకలను ఇంట్లోనే కుటుంబసభ్యులతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు, సంగం సీఐలు జీ గంగాధర్, వేమారెడ్డి సూచించారు. యువత హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం వారు ఎస్సైలతో కలిసి తమ కార్యాలయాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయడం, మద్యం సేవించి బైక్‌లు నడపడం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించేదెప్పుడో?

- నాలుగు నెలలు గడుస్తున్నా సమావేశమవని కౌన్సిల్
- పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఆత్మకూరులో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు

ఆత్మకూరు: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ప్రతి నెలా నిర్వహించాలి. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారాలను ఆమోదించాలి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఒక్కసారి మాత్రమే తూతూ మంత్రంగా నిర్వహించారు. ఆ తరువాత నాలుగు నెలలు గడుస్తున్నా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో పారిశుధ్యం లోపించి దోమలు విజృంభిస్తున్నాయి. విషజ్వరాలు ప్రబలుతున్నాయి. అంతర్గతరోడ్లు దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలను ఎవరు పరిష్కరిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీలో 35వేలకుపైగా జనాభా నివాసం ఉంటున్నారు. మున్సిపల్ పరిధిలో 23 వార్డులుగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని మెయిన్‌రోడ్డుతో సహా అంతర్గత రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సి వస్తోంది. పట్టణంలో పారిశుధ్యం సైతం అధ్వానంగా తయారైంది. 6వ వార్డు ప్రియదర్శినినగర్, 14, 5వ వార్డుల పరిధిలోని జేఆర్‌పేట శివారు ప్రాంతం, ఆర్టీసీ ఎదురు వీధిలో నూతనంగా నిర్మించిన ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. ఇళ్ల మధ్యన ఉన్న ఖాళీ స్థలాలు మురుగుతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తే కౌన్సిలర్లు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని చూస్తున్నారు. అయితే నాలుగు నెలలు గడుస్తున్నా కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిధుల పరిస్థితి ఏమిటి?

14వ ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో ఖర్చు చేసినా జమా ఖర్చులపై పూర్తి స్థాయిలో చర్చించలేదు. ఆ తరువాత 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా మంజూరయ్యాయి. అంతలోనే ఎన్నికలు రావడం..ఆ తరువాత కూటమి ప్రభుత్వం ఏర్పడడం జరిగింది. ఇప్పటి వరకు ఒక్కసారి మాత్రమే హడావుడిగా కౌన్సిల్ సమావేశం నిర్వహించి ముగించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏ మేరకు మంజూరయ్యాయి..వాటిని ఏఏ పనులకు వినియోగిస్తున్నారన్న దానిపై చర్చించ లేదు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధుల పరిస్థితి ఏమిటంటూ కౌన్సిలర్లు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

మంత్రి ఆనం చెబితేనే..

మంత్రి ఆనం చెబితేనే కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారని ఒకరిద్దరు టీడీపీ కౌన్సిలర్లు చెప్పడం విశేషం. మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మంత్రిని ఆహ్వానించగా ,మున్సిపల్ కార్యాలయంలోని 3వ అంతస్తులో ఉన్న ఎంజీఆర్ సమావేశ మందిరంలో జరిగే కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యేందుకు మేడ మెట్లు ఎక్కలేక లిఫ్ట్ ఏర్పాటు చేయాలని సూచించినట్లుగా సమాచారం. దీంతో ఆఘమేఘాల మీద లిఫ్ట్ ఏర్పాటుకు టెండర్లు సైతం పిలిచినట్లుగా తెలిసింది. కాగా ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్‌ను సంప్రదించగా సాంకేతిక సమస్యలకు తోడు, వర్షాలు, పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడం, తదితర కారణాలతో కౌన్సిల్ సమావేశం నిర్వహించడం కొంత ఆలస్యమైందని తెలిపారు. జనవరి 7న కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. కౌన్సిల్ అజెండాలో పలు సమస్యలను చేర్చి కౌన్సిలర్లు ఆమోదంతో పరిష్కరిస్తామని తెలిపారు.



మున్సిపల్ కార్యాలయం

పోలేరమ్మ గ్రామోత్సవానికి ముస్తాబు



పోలేరమ్మ ఆలయం వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన భారీ ఆర్చీ

అల్లూరు: పోలేరమ్మ గ్రామోత్సవానికి అల్లూరు ముస్తాబైంది. పోలేరమ్మ, కలుగోళమ్మ, గంగమ్మ గ్రామోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. పోలేరమ్మ గ్రామోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకనుగుణంగా వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఉదయం సద్ది నివేదన నుంచి రాత్రి గ్రామోత్సవం వరకు జరిగే కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లను పక్కాగా సిద్ధం చేశారు. పురవీధులను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కాగా గ్రామోత్సవం ఏర్పాట్లను కావలి ఆర్డీఓ వంశీకృష్ణ సోమవారం పరిశీలించారు. పోలేరమ్మ గ్రామోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ

ఆత్మకూరు: పొదుపు మహిళలు ప్రభుత్వ అందించే సహకారం, బ్యాంకులు అందించే సబ్సిడీ రుణాలను అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ రాధమ్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో సీఎంఎం మాధవి ఆధ్వర్యంలో పొదుపు మహిళల ఆర్థిక స్వావలంబనపై ఆర్పీలకు శిక్షణా తరగతులను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీడీ రాధమ్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పొదుపు సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించి రెట్టింపు మొత్తంలో తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కుటీర పరిశ్రమలను ఏర్పాటు ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా చూడాలన్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకుని సబ్సిడీ రుణాలతో పరిశ్రమలను స్థాపించాలని, వివిధ కార్పొరేషన్ల ద్వారా అందజేస్తున్న రుణాలను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెప్మా ఐబీ అంకయ్య, ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ కే హరికృష్ణ, ఎన్‌డీసీసీబీ మేనేజర్ శ్రీనివాసరావు, ఎస్‌బీఐ మేనేజరు ఎండీ మున్వర్, ఇండియన్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు: అరుణమ్మకు సత్కారం

వరికుంటపాడు: పొదుపు సమాఖ్యలు బలోపేతం కావాలని ఏపీఎం సుధాకర్ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో పొదుపు సమాఖ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని అర్హులైన మహిళలకు రుణాలు అందించి ఆర్థిక పరిపుష్టి సాధించేలా చూడాలన్నారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలన్నారు. స్త్రీనిధి, ఎస్సీ, ఎస్టీ సాబ్ ప్లాన్, సామాజిక పెట్టుబడి నిధుల రికవరీను నూరు శాతం సాధించాలన్నారు. అనంతరం ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల అరుణమ్మను సన్మానించారు.

‘కలయిక’ నూతన కమిటీ ఎన్నిక



కావలి: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కలయిక విజ్ఞాన కేంద్రం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కేంద్రం కన్వీనర్లుగా జీ రాంప్రసాద్ , ఇలింద్ర లావణ్య ,కార్యవర్గ సభ్యులుగా మాకినేని అరుణ, ఎల్ శ్యామల, సీ శారద, జీ హరనాథ్ , టీ వెంకటేశ్వర్లు, కే మాధవరావు, ఎంవీ రమణయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక చైతన్యం, యువత ప్రగతిశీలతకు నాంది పలికేలా కలయిక విజ్ఞాన కేంద్రాన్ని నిర్వహించేందుకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కలయిక విజ్ఞాన కేంద్రాన్ని ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటలు వరకు తెరిచి ఉంచనున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో పుస్తక పఠనాభిలాషను పెంపొందించడంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగించేందుకు ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు గాయకుడు రామచంద్రరావు సహకారంతో బాలబాలికలకు దేశభక్తి గీతాలు, లలిత సంగీతంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విశ్రాంత అధ్యాపకులు కోలా మాధవరావు ఆధ్వర్యంలో విద్యాలయాల్లో మోటివేషన్ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. సంక్షేమ వసతి గృహాల్లో అధ్యయన తరగతులు, వెనుకబడిన విద్యార్థుల కోసం ‘సందేహాల నివృత్తి ’ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. కలయిక విజ్ఞాన కేంద్రానికి వచ్చే విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. గ్రంథాలయం నుంచి ఇంటికి పుస్తకాలను తీసుకెళ్లి తిరిగి ఇచ్చేలా నిబంధనలు సిద్ధం చేస్తామన్నారు. పట్టణంలోని యువత, విద్యార్థులు, ప్రజానీకానికి ప్రయోజనకరమైన పుస్తకాలను దాతలు విరాళంగా అందజేస్తే స్వీకరిస్తామని తెలిపారు. ప్రత్యేక దినోత్సవాలను జరిపి ప్రజల్లో వికాసం , విజ్ఞానం , సామాజిక స్పృహ, చైతన్యం తీసుకురావాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు. కలయిక విజ్ఞాన కేంద్రం ఆవరణలో సామాజిక సంస్థలు తమ కార్యక్రమాలను కేవలం నిర్వహణ ఖర్చును మాత్రమే చెల్లించి నిర్వహించుకోవచ్చని తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

ఆత్మకూరు: ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకుంటున్న విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఫిబ్రవరి 28వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్లను సబ్‌ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని ఆత్మకూరు సబ్‌ట్రెజరి అధికారి ఎస్‌పీ రవికుమార్ సోమవారం తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్లు అందజేయకపోతే పింఛన్ నిలిచిపోతుందని చెప్పారు.

4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

జలదంకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జనవరి 4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య సోమవారం తెలిపారు. ఎంపీపీ జీ వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రెవెన్యూ సదస్సు వేదిక మార్పు

మర్రిపాడు: జనవరి 2న పల్లవోలులో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సు వేదికను మార్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు. పల్లవోలు, తిక్కవరం గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామసచివాలయానికి బదులుగా తిక్కవరంలోని వాటర్ ప్లాంట్ వద్ద ఉదయం 9 నుంచి నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పీహెచ్‌సీలోని సమస్యల పరిష్కారానికి కృషి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారులు

దుత్తలూరు: దుత్తలూరు పీహెచ్‌సీలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీడ్స్ సంస్థ వ్యవస్థాపకులు ఆర్ చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మరో విశ్రాంత ఐఏఎస్ అధికారి డబ్ల్యూఆర్ రెడ్డితో కలిసి దుత్తలూరు పీహెచ్‌సీని సందర్శించారు. సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను చంద్రమౌళీశ్వరరెడ్డి తన సతీమణి కవితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్‌ను అడిగి పీహెచ్‌సీలోని వసతులు, సమస్యలను తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన ల్యాబ్ భవనానికి త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ అవసరమని తెలుపగా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి



చేజర్ల: దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీకి వెంకటాచలంలోని దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం(సీఆర్సీ) ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి 53 మంది దివ్యాంగులు హాజరుకాగా సీఆర్సీ ప్రతినిధులు పరిశీలించి అర్హులైన వారిని ఉపకరణాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయలలిత మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా సీఆర్సీ పనిచేస్తోందని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన వినికిడి యంత్రాలు, మూడు చక్రాల బండ్లు, వీల్‌చైర్స్, తదితరాలను సీఆర్సీ అందజేస్తోందని వివరించారు. దివ్యాంగులు ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఆర్సీ ప్రతినిధి రఘు, స్పెషల్ ఎడ్యుకేటర్ రాయపురెడ్డి పాల్గొన్నారు.

శంభన్‌లను ఎస్సీలుగా పరిగణించడంపై అభ్యంతరం

అల్లూరు: శంభన్ కులస్థులను ఎస్సీలుగా పరిగణించడంపై అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజ్ అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రజనీకాంత్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కులగణన జరిపి ఎస్సీ జాబితాలను సచివాలయాల్లో ప్రచురించారని, అందులో శంభన్ కులస్థులను చేర్చి ఉన్నారని చెప్పారు. పంచాయతీ అధికారులను ప్రశ్నించగా ప్రభుత్వ సూచనల మేరకు ఎస్సీ జాబితాలో చేర్చినట్లు చెప్పారన్నారు. ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించమని, వెంటనే తొలగించాలని కోరారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి



జలదంకిలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఉదయగిరి/జలదంకి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జలదంకి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వారు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఉదయగిరిలోనూ వామపక్షాలు నిరసన ప్రదర్శన చేపట్టాయి. సీపీఎం, సీపీఐ నాయకులు కాకువెంకటయ్య, తాళ్లూరి మాల్యాద్రి, గడ్డం మాల్యాద్రిరెడ్డి, రావి మాల్యాద్రి, ఆంథోనీబాబు పాల్గొన్నారు.

కావలి: పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్ష నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. బీజేపీ మతతత్వ విధానాలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బలపరుస్తూ అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడం దుర్మార్గమన్నారు.

అసంపూర్తిగా ముగిసిన వేలంపాట

ఉదయగిరి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ గదులు, బస్టాండ్‌లో వాహనాల రుసుం వసూళ్లకు సంబంధించి సోమవారం నిర్వహించిన వేలంపాట అసంపూర్తిగా ముగిసింది. వేలంలో ఇద్దరు వ్యక్తులు ధరావత్తు చెల్లించి పాల్గొన్నారు. అందులో యాస్మిన్ రూ.2 లక్షలకు పాట దక్కించుకున్నారు. కాగా ఉపసర్పంచ్ షేక్ ముర్తుజాహుస్సేన్ వేలంలో పాల్గొనే ప్రయత్నం చేయగా సమయం ముగిసిందని వేలం నిర్వహణాధికారి నిరాకరించారు. అయితే సర్పంచ్ సామ్రాజ్యం వేలంలో ఒక్కరే పాల్గొన్నందున రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించి వెళ్లిపోయారు. దీంతో విషయాన్ని ఆత్మకూరు డీఎల్‌పీఓ దృష్టికి అధికారులు తీసుకెళ్లగా మంగళవారం పంచాయతీ పాలకవర్గ సమావేశాన్ని అత్యవసరంగా నిర్వహించి తుదినిర్ణయం తీసుకోవాలని సూచించారు. వేలం ప్రక్రియలో ఎంపీడీఓ అప్పాజీ, పంచాయతీ కార్యదర్శి కరిముల్లా పాల్గొన్నారు.

భర్త మృతిపై ఫిర్యాదు

కావలి: భర్త మృతిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు కావలి రెండో పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు... జలదంకి రమణయ్య (51) కొద్దిరోజులుగా అనారోగ్యం బాధపడుతున్నాయి. కావలిలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటూ కావలిలోని తన సోదరుడి ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు రమణయ్య తన సోదరుడితో కలిసి కావలి ఏరియా ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చారు. రమణయ్య సోదరుడు నగదు కోసం ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లాడు. కొంత సమయం తర్వాత తిరిగి వచ్చి చూడగా అక్కడ రమణయ్య కనిపించలేదు. సోమవారం ఉదయం 7గంటల సమయంలో రమణయ్య క్రిస్టియన్‌పేట ఫస్ట్ లైన్‌లో మృతి చెంది ఉండడం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు రమణయ్య భార్య రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సీతారామపురం: సైన్స్ నమూనాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు



సోమశిలలో..



మర్రిపాడు: నమూనాలను తిలకిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాసులు



వింజమూరులో..



దుత్తలూరులో..

మర్రిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్‌ఫేర్‌ను సోమవారం నిర్వహించారు భారత విదేశీ మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ, ఐఎఫ్ఎస్ అధికారి బుడుగు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే విజ్ఞానశాస్త్రంపై మక్కువ పెంచుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం పద్మలత, జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ రాంకుమార్, ఎంఈఓ–2 ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓలు ఎం జ్యోతి, డీ సాయిప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా ఏఎస్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్‌ఫెయిర్‌ను సోమవారం నిర్వహించారు. మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ నమునాలు ఆకట్టుకున్నాయి. కాగా విద్యార్థి వ్యక్తిగత విభాగంలో గుంపర్లపాడు ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ సైరాభాను, గ్రూప్ విభాగంలో చిరమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డీ హర్షవర్ధన్, కే కుమార్, టీచర్ విభాగంలో చిరమన ఫిజికల్ సైన్స్ టీచర్ వీవీ నరేష్‌చంద్ర ప్రాజెక్ట్‌లను జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక చేశారు.

దుత్తలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగలక్ష్మి పర్యవేక్షణలో మండల స్థాయి సైన్స్‌ఫెయిర్‌ను సోమవారం నిర్వహించారు. వ్యక్తిగత ప్రదర్శన కింద నందిపాడు కేజీబీవీ, గ్రూప్ ప్రదర్శన కింద దుత్తలూరు ఏపీ మోడల్‌స్కూల్, ఉపాధ్యాయులకు సంబంధించి ఏరుకొల్లు ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ ఎం.రామారావు నమూనాలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు.

సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం తిలకించి మూడు విభాగాల్లో మూడు ప్రయోగాలను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

సోమశిల: అనంతసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫెయిర్‌ను సోమవారం నిర్వహించారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నమూనాలను తిలకించారు. సోమశిల, రేవూరు, అనంతసాగరం ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. హెచ్ఎం లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్‌ఫేర్‌ను నిర్వహించారు. మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు 15 నమూనాలను ప్రదర్శించారు. ఎంఈఓ తోట శ్రీనివాసులు విద్యార్థుల నమూనాలను పరిశీలించారు. ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. న్యాయనిర్ణేతలుగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మధుకిరణ్, అధ్యాపకులు రమేష్, కౌసల్య వ్యవహరించారు.

–వింజమూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.